క్లుప్తంగా

నేడు 2కే మారథాన్

శ్రీకాళహస్తి : ఆడుదాం–ఆంధ్ర క్రీడా పోటీలపై అవగాహన కల్పించేందుకు ఆదివారం 2కె మారథాన్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహ్మద్ రఫీ ఖాన్ శనివారం తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సారథ్యంలో ఉదయం 7 గంటలకు పట్టణంలోని ఆర్పీబీఎస్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి మారథాన్ ప్రారంభమవుతుందన్నారు. అక్కడ నుంచి నాలుగు మాడ వీధుల మీదుగా సాగి తిరిగీ పాఠశాలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. శ్రీకాళహస్తి రూరల్, అర్బన్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

సంపూర్ణ గీతా పారాయణం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని కాకినాడ శ్రీమద్భగవద్గీత ప్రచార సంస్థ సుధామాధురి ఆధ్వర్యంలో సంపూర్ణ గీతా పారాయణం నిర్వహించారు. 97మంది ఈ పారాయణంలో పాల్గొన్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి పర్వదినం రోజున సంపూర్ణ గీతా పారాయణం చేయడం ఆనందంగా ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



రాజగోపాల్‌ను పరామర్శిస్తున్న పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : తొట్టంబేడు మండలం పొయ్య గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాయకుడు రాజగోపాల్‌ను పార్టీ తొట్టంబేడు ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల రాజగోపాల్ ప్రమాదానికి గురయ్యారు. చికిత్స అనంతరం ఆయన ఇంటికి చేరుకున్నారు. ఆ గ్రామానికి చేరుకుని రాజగోపాల్‌ను ఆమె పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు, మణి, మోహన్, రాజబాబు, గోపాల్ పాల్గొన్నారు.

23న సీపీఐ ఆవిర్భావ వేడుకలు

శ్రీకాళహస్తి: పట్టణంలో ఈనెల 26న సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి మురళి తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వాడవాడలా జెండాలు ఎగరాలని పిలుపునిచ్చారు. నాయకులు జనమాల గురవయ్య తదితరులు పాల్గొనానరు.

దుప్పట్ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని క్రీస్తు సంఘంలో క్రిస్మస్ సందర్భంగా ఈఎంసీ ఫౌండేషన్ సహకారంతో సపోర్టు సంస్థ డైరెక్టర్ జోసఫ్‌రాజు శనివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. సువార్తకులు ఎం.సురేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రంలో జోసఫ్‌రాజు మాట్లాడుతూ ఈఎంసీ వ్యవస్థాపకుడు ఎడ్వర్డ్ రాష్ట్రమంతా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

సరుకుల పంపిణీ



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం, అంబూరు, నీర్పాకోట, కనమనంబేడు గ్రామాల దళిత, గిరిజన కాలనీల్లో తుపాన్ బాధిత 150 కుటుంబాలకు శనివారం నవజీవన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కాల్వపల్లి సహదేవయ్య మాట్లాడుతూ 9 రకాల సరుకులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఎంఈఓ రవీంద్రనాథ్, డీకే చంద్రబాబునాయుడు, సర్పంచ్ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నేత గోపాల్ రెడ్డి, కార్యదర్శి ఇందిర, ఉపసర్పంచ్ మునిరాజ పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో రెండు పాడి గేదెల మృతి

కేవీబీపురం: మండలంలోని అంజూరు పాళెం గ్రామంలో కరెంట్ షాక్‌తో శనివారం రెండు పాడి గేదెలు మృతి చెందాయి. బాధిత రైతు కథనం మేరకు.. గ్రామానికి చెందిన మురగయ్య యథావిధిగా గేదెలను పొలాలకు తోలుకెళ్లాడు. ఇంటికి తరలిస్తున్న సమయంలో 11 కేవీ విద్యుత్ తీగలు తెగి గేదెలపై పడడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.1.10 లక్షలు చేస్తుంది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

పార్కింగ్ కేంద్రం తనిఖీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెందిన వాహనాల పార్కింగ్‌ను శనివారం ఈవో కేఎస్ రామారావు తనిఖీ చేశారు. వాహనదారులకు ఇస్తున్న రసీదులను పరిశీలించారు. వాహనానికి ఎంత వసూలు చేస్తున్నారని వాహనదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన నిర్వాహకులతో మాట్లాడుతూ భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని తెలిపారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధంగా ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయంలో పునర్నిర్మాణ పనులు జరుగుతుండడంతో బాలాలయం ఏర్పాటు చేశారు. వేకువజామున ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి స్వామివారు గరుడ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో కేఎస్ రామారావు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన అభయహస్త శ్రీవేంకటేశ్వరస్వామికి వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పాలు, పెరుగు, చందనం, నారికేళ, కలశ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపధూప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. పాలకమండలి చైర్మన్ శ్రీనివాసులు, ఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాట్రపల్లె వైకుంఠనాథస్వామి ఆలయంలో..

కేవీబీపురం: మండలంలోని కాట్రపల్లె శ్రీవైకుంఠనాథస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గవర్లకృష్ణయ్య, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అశేషంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఎంపీపీ మునిలక్ష్మి, సర్పంచ్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో

సత్యవేడు: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీసిటీలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. గోవింద నామస్మరణ మార్మోగింది. వేకువజామున ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తుల రద్దీ కన్పించింది. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో హరికథా గానం, భజన కార్యక్రమాలు జరిగాయి. పుత్తూరుకు చెందిన ప్రఖ్యాత పండితుడు ఒంటి రవి ఆలపించిన అంబరీష చరిత్ర హరికథా గానం విశేషంగా అలరించింది. ఇరుగుళం, మల్లవారి పాళెం వెస్టు గ్రామాలకు చెందిన శ్రీతిరువెంకట రామానుజ భక్త సమాజం సభ్యుల కోలాటం, భజన కార్యక్రమలు ఆకట్టుకున్నాయి.



శ్రీకాళహస్తి : వరదరాజస్వామి ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని శ్రీపసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేక పూజలు, విశేష అలంకరణలు జరిగాయి. ఉదయం నుంచి భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఉత్సవమూర్తులను గ్రామంలో ఉరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించారు. రిటైర్డు ఎస్పీ రమేషయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవీరాంజనేయస్వామి సేవలో ఎమ్మెల్యే

పిచ్చాటూరు: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, ఆయన తనయుడు, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్ ఉదయం 9 గంటలకు ఆలయాన్ని దర్శించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నారాయణవనంలో..

నారాయణవనం: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. వేకువ జామున 2 గంటలకు తిరుప్పావైతో ఆలయాన్ని తెరచి తోమాల, శుద్ధి, ధనుర్మాస పూజలను పూర్తి చేసి భక్తులను అనుమతించారు. ఏకాదశి గడియల్లో ఉభయ నాంచారుల సమేత వెంకన్నకు ప్రత్యేక స్నపన తిరుమంజనం పూర్తి చేసి దీప ధూప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింప చేశారు. మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం లోపల, బయట ప్రత్యేక అలంకరణలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచే పెద్దఎత్తున స్వామివారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. ధర్మకర్త వేలా సుందరం భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేశారు. స్థానిక వ్యాపారి పవన్‌కుమార్ ప్రసాదాలను పంపిణీ చేశారు. అర్చకులు మధుసూదన్ శర్మ, మోహనాచార్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.



శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో..



శ్రీకాళహస్తి: తొండమాన్‌పురంలో..

తొండమాన్‌పురంలో..

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో టీటీడీ అనుబంధంగా ఉన్న ప్రసన్న వేంకటేశ్వరాలయంలో విశేషపూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో కూడా విశేష పూజలు నిర్వహించారు. రాత్రి గరుడవాహన సేవ నేత్రపర్వంగా సాగింది.



వరదయ్యపాళెం : ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు



నారాయణవనం: స్వామి,అమ్మవార్ల ఊరేగింపు



శ్రీకాళహస్తి: వరదరాజస్వామి ఆలయంలో ప్రసాదాలు అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాసులు



కేవీబీపురం: కాట్రపల్లెలో ఊరేగింపు



సత్యవేడు: పూజల్లో పాల్గొన్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి దంపతులు



శ్రీకాళహస్తి : విశేషాలంకరణలో వరదరాజస్వామి



బీఎన్‌కండ్రిగ : పూజల్లో పాల్గొన్న భక్తులు



శ్రీకాళహస్తి : ఊరందూరులో గరుడవాహన సేవ

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



పిచ్చాటూరు: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న బాధితులతో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నియోజకవర్గంలోని 9 మంది లబ్ధిదారులకు రూ.14 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న ప్రజలను వైఎస్సార్ బీమా, ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాలతో ఆదుకుంటున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 26 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుందని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన ఆట పరికరాలు ఇప్పటికే ఆయా మండలాలకు చేరుకున్నాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా విజయవంతం చేయాలని సూచించారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కేవీ చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు రాగమ్మ, నాయకులు మోహన్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, ఉదయ కుమార్ రెడ్డి, బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురంలో ట్యాబ్‌ల పంపిణీ

నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు జగనన్న ట్యాబ్‌లు పంపిణీ చేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ, జనసేన ఓర్వలేక పోతున్నారన్నారు. ఎంఈఓ బాబయ్య, సర్పంచ్ సుధ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, రైతు సలహా మండలి మండలి చైర్మన్ చిన్నదొరై, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ కల్పన, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ఎం.సురేష్ పాల్గొన్నారు.

ఆటాడుదాం..అద్భుతాలు సృష్టిద్దాం

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసి ఉత్తమ క్రీడాకారులు తీర్చి దిద్దేందుకే ఆడుదాం–ఆంధ్ర క్రీడాపోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని మండల అధికారులు పేర్కొన్నారు. యువకులు పోటీల్లో పాల్గొని క్రీడా సత్తా చాటాలని పిలుపునిచ్చారు. సత్యవేడు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శనివారం ఆడుదాం–ఆంధ్ర క్రీడా పోటీలపై అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

సత్యవేడు: ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ కె.రవి, సచివాలయ కన్వీనర్ బి.సోమశేఖర్, హెచ్ఎం భారతి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: మండల కేంద్రంలో ఆడుదాం ఆంధ్ర పై అధికారులు, విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద అధికారులు రోడ్డుపై బ్యాడ్మింటన్ ఆడుతూ కార్యక్రమాన్ని వినూత్నంగా అవగాహన కల్పించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు ఎంఈఓ యుగంధర్ రాజు, ఈఓపీఆర్‌డీ శ్రీదేవి, పీఈటీలు అములు, కిషోర్, బాలసుబ్రమణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే నాగలాపురంలో ఆడుదాం ఆంధ్ర ర్యాలీని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు.



వరదయ్యపాళెం: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ప్రజాప్రతినిధులు

విజయవంతం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో ఎంపీడీఓ సాయిలహరి ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఎంఈఓ రవీంద్రనాథ్, హెచ్ఎం రమణయ్య, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా, పీడీలు మస్తాన్, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనంలో

నారాయణవనం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలవిద్యార్థులతో అవగాహన ర్యాలీ జరిగింది. ఎంఈవో ప్రభాకర్‌రాజు, పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, ఎంఈవో –2 గోవిందస్వామి, వైస్ ఎంపీపీ శివశంకర్, ప్రజాప్రతినిధులు గురుస్వామి, పెద్దదొరై, శంకరయ్య, మోహన్, శరవణ, బాలమురుగన్, ఆర్ముగం, హెచ్ఎం సులోచన, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం, సంతవేలూరు గ్రామ పంచాయతీల్లో ఆడుదాం ఆంధ్ర అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, సర్పంచ్ జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, కో–ఆప్షన్ సభ్యుడు సిద్దిక్, పంచాయతీ ఈఓ బసిరెడ్డి, పీఈటీ బందిల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నాగలాపురంలో ఆడుదాం ఆంధ్ర ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం



బుచ్చినాయుడుకండ్రిగలో ర్యాలీలో



సత్యవేడు: విద్యార్థుల ర్యాలీ

కోలాహలంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు



యూరో కిడ్స్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు



డాక్టర్ కిషోర్స్ రత్నంలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ ట్రీలను అందంగా అలంకరించారు విద్యార్థులు శాంతాక్లాజ్ వేషధారణలో అలరించారు. నిర్వాహకులు క్రిస్మస్ విశేషాలను వివరించారు. యూరోకిడ్స్‌లో డైరెక్టర్ చంద్రశేఖర్, కరస్పాండెంట్ మునిలక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. డాక్టర్ కిషోర్స్‌రత్నం పాఠశాలలో జరిగిన వేడుకల్లో డైరెక్టర్లు కృష్ణకిషోర్, వాసంతి కిషోర్, ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. శ్రీరామ్‌నగర్ కాలనీ శ్రీచైతన్య పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో ప్రిన్సిపల్ రూపాదేవి, ఏజీఎం సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంజీఎం పాఠశాలలో డైరెక్టర్ గుడ్లూరు మయూర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో హెచ్ఎం మునిరత్నం నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎల్ఐసీ కాలనీని సెయింట్ జేవియర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జరిగిన వేడుకలకు స్థానిక రోమన్ క్యాథలిక్ చర్చి గురువు కిరితం ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులను ఆశీర్వదించారు. హెచ్ఎం సిస్టర్‌షెర్లీ తదితరులు పాల్గొన్నారు.



శ్రీచైతన్య పాఠశాలలో..



ఎంజీఎంలో..



సెయింట్ జేవియర్‌లో..

నేడు ద్వాదశి ద్వారోత్సవం

నారాయణవనం : మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వైకుంఠ ద్వాదశి ద్వారోత్సవంలో భక్తులను ఉత్తర ద్వార ప్రవేశం కల్పించనున్నారు. వైష్ణవ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి రోజున ద్వార దర్శనం ఉంటుంది. నారాయణవనంలో ద్వాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం ప్రత్యేకం. ఈమేరకు టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. వేకువ జామున ధనుర్మాస పూజలు, 5.30 గంటలకు స్నపన తిరుమజనం నిర్వహించనున్నారు. 7.30 గంటలకు ఊరేగింపు అనంతరం ఉభయ దేవరులతో కల్యాణ వెంకన్న ఆలయ అంతర ప్రాకార ఉత్తర ముఖ ద్వారంలోకి ప్రవేశిస్తారు. ఉదయం 8 గంటల నుంచి ద్వార ప్రవేశానికి ఏర్పాట్లను చేపట్టారు.

ముక్కంటి సేవలో పలువురు ప్రముఖులు





ఆలయంలో జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు జ్ఞాపిక అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ సూర్యకాంత్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పిడికా రాజన్న దొర, దేవదాయశాఖ మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను చైర్మన్ అందజేశారు.



ఆలయ ధ్వజస్తంభం వద్ద జస్టిస్ సూర్యకాంత్